క్లుప్తంగా

15, 16వ తేదీల్లో క్రీడా పోటీలు

కల్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్న చీఫ్ మినిస్టర్స్ కప్‌లో భాగంగా మండల స్థాయి క్రీడా పోటీలు ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్నట్లు పీఈటీ పి.వీరరాఘవయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడా పోటీలకు క్రీడాకారులు సిద్ధం కావాలని, క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవడం కోసం ప్రతీరోజు ఉదయం, సాయంత్రం గ్రీన్ ఫీల్డ్ మినీస్టేడియంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 15 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన క్రీడాకారులు ఈ పోటీలకు అర్హులని, షటిల్ బ్యాట్మింటన్ పురుషులు, మహిళలు, వాలీబాల్ పురుషులు, మహిళలు, కబడ్డీ పురుషులు, మహిళలు, అథ్లెటిక్స్ పురుషులు, మహిళలు, ఫుట్‌బాల్ పురుషులకు క్రీడలు నిర్వహించడం జరుగుతుందని, పూర్తి వివరాలకు 9440669401 నంబర్‌ను సంప్రదించాల్సిందిగా కోరారు.

ఆర్థికసాయం


సాయం అందజేస్తున్న మత్స్యకారులు

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని గంగారం గ్రామానికి చెందిన బేతుపల్లి చెరువు మత్స్యసొసైటీ సభ్యుడు కాక ముత్యాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి గంగారం మత్స్యకారులందరూ సొసైటీ అధ్యక్షుడు ఊకే కన్నారావు ఆదివారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి పొదిలి మారేశ్వరరావు, కాకా రామచంద్రరావు, కరాటే రమేష్, మాజీ ఎంపీటీసీ వాడే మల్లేష్, స్వయం కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ చలమారావు, కోరం వీరస్వామి, శివకృష్ణ, నాగేశ్వరరావు, పొట్టి, బెటాలియన్ కానిస్టేబుల్ ఈశ్వర్, వెంకట్రావు, మోహన్‌రావు, పొట్టా శ్రీను, కాకా నాగేష్, రాము, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి


మధిర: మాట్లాడుతున్న కిషోర్

మధిర: యువ సంఘర్షణ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ కోరారు. ఆదివారం పార్టీ మండల కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ నెల 8న హైదరాబాద్ సరూర్ నగర్‌లో జరుగుతున్న యువ సంఘర్షణ సభకు నిరుద్యోగ యువత, విద్యార్థులు, కాంగ్రెస్ కార్యకర్తలు భారీ స్థాయిలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మధిర పట్టణ అధ్యక్షుడు మిర్యాల వెంకట రమణ గుప్తా, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దారా బాలరాజు, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ షేక్ జహంగీర్, బిట్ర ఉద్దండయ్య, కర్నాటి రామారావు, పగిడిపల్లి డేవిడ్, పుట్టా పుల్లారావు, ఆదిమూలం శ్రీనివాసరావు, రామారావు, సంపసాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: నిరుద్యోగ యువత కోసం కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ హైద్రాబాద్‌లో చేపట్టిన యువ సంఘర్షణ సభను కార్యకర్తలు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థి, నిరుద్యోగ యువత కోసమే ప్రియాంక గాంధీ ఈసభ నిర్వహిస్తున్నట్లు, ఈసభలోనే ఆమె యూత్ డిక్లరేషన్ విడుదల చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వైద్యశిబిరం విజయవంతం

బోనకల్: మండలకేంద్రంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. ప్రముఖ వైద్యులు టి.పవన్‌కుమార్ రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల ఆఖరున జానికీపురం గ్రామంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చారిటబుల్ సభ్యులు తూము రోషన్ కుమార్, బొమ్మినేని కొండలరావు, యంగల ఆనందరావు, ఆకెన పవన్ పాల్గొన్నారు.

నేడు మడుపల్లిలో..

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అన్నవరపు సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గ్రంథాలయం వద్ద ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం అయిన వారికి ఉచితంగా ఆపరేషన్ చేయడం జరుగుతుందని, వివరాలకు 8977605351 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

చి'వరి'కి ఎదురుచూపులే

పేరుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- కొనుగోళ్లలో జాప్యంతో అయోమయంలో రైతులు
- ధాన్యపు రాశుల వద్ద నిద్రాహారాలు మాని కాపలా
- అయినా పట్టింపు లేనట్లుగా అధికారులు


రాయన్నపేట కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం రాశులు

బోనకల్: యాసంగిలో వరి సాగు చేసిన రైతులకు అడుగడుగునా కష్టాలు ఎదురవుతున్నాయి. అకాల వర్షాలతో పంట కొంత మేరా నష్టపోగా.. ఇప్పుడు ధాన్యాన్ని అమ్ముకునేందుకు కూడా అవస్థ పడాల్సి వస్తోంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు చెబుతున్నా సాఫీగా కొనుగోళ్లు సాగగా.. పొలాలు, కల్లాల్లో దాచుకొని రాత్రనకా పగలనకా కాపలా కాయల్సి వస్తోంది. దీంతో పంట పెట్టుబడికి అప్పు చేసిన రైతులు వడ్డీ భారం రోజురోజుకు పెరుగుతోందని వాపోతున్నారు.

నిరుపయోగంగా కేంద్రాలు..

మండలంలో ఏర్పాటు చేసిన ఐదు ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. రైతుల సౌకర్యార్థం సివిల్ సప్లయీస్ ఆధ్వర్యంలో మండలంలోని కలకోట, రాయన్నపేట, మోటమర్రి, బ్రాహ్మణపల్లి, నారాయణపురం గ్రామాల్లో నెల క్రితం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీంతో ఆశగా రైతులు ధాన్యం తీసుకొస్తే నిరాశే ఎదురవుతోంది. 'ఏ' గ్రేడ్ రకం క్వింటాకు రూ.2,060, కామన్ రకం క్వింటాకు రూ.2,040 ధర నిర్ణయించారు. కానీ రకరకాల నిబంధనలు, కొర్రీలతో జాప్యం చేస్తుండడంతో రైతులు జాగారం చేయాల్సి వస్తోంది. ఇక కొనుగోలుకు అంగీకరించి కాంటా వేసినా.. దిగుమతి చేసుకునేందుకు మిల్లర్ల సాకులతో మరింత ఇబ్బంది ఎదురవుతోంది.

నిబంధనల పేరుతో జాప్యం..

తాలు, దోమకాటు, గింజ ఆరుదల తదితర నిబంధనలతో కొనుగోళ్లు సాఫీగా జరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా భావించిన దళారులు తక్కువ ధరకు అడుగుతుండడంతో ఏం చేయాలో తెలియక అయోమయంలో పడుతున్నారు. దీనికి తోడు అకాల వర్షాలు రైతులకు శాపంగా మారాయి. పది రోజులుగా అకాల వర్షాలు రైతుల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని తడవకుండా కాపాడుకునేందుకు అహర్నిశలు శ్రమించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోళ్లలో వేగం పెంచాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి..



యాసంగిలో ఐదు ఎకరాల్లో వరి సాగు చేస్తే అకాల వర్షాలతో పంట దెబ్బతింది. ఎలాగోలా పంట నూర్పిడి చేసి వడ్లను కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాను. వర్షంతో కాపాడుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాం. అధికారులు స్పందించి కొనుగోళ్లు చేపట్టాలి.

– చావా నాగేశ్వరరావు, రైతు

పడిగాపులు కాస్తున్నాం..



కొనుగోలు కేంద్రానికి వడ్లు తీసుకువచ్చి నెల రోజులవుతోంది. 200క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రంలో పోశాను. అయినా కాంటా వేయకపోడంతో పడిగాపులు కాస్తున్నాను. వర్షానికి ధాన్యం తడవకుండా పట్టాలు కప్పి కంటికి రెప్పలా కాపాడాల్సి వస్తోంది.

– వల్లెబోయిన కృష్ణ, రైతు

దళారులు అడ్డంగా అడుగుతున్నారు



ధాన్యాన్ని దళారులు తక్కువ ధరకే అడుగుతున్నారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.2,060గా ప్రకటించినా వ్యాపారులు రూ.1,600 ఇస్తామంటున్నారు. అలా ఇస్తే క్వింటాకు రూ.400 నష్టపోయినట్లే. అధికారులు కొనుగోలు చేస్తేనే మా ఇబ్బందులు తీరతాయి.

– పారా వెంకటేశ్వరరావు, రైతు

అల్లూరి స్ఫూర్తితో పోరాడుదాం..


అల్లూరికి నివాళులర్పిస్తున్న నాయకులు

తల్లాడ: బ్రిటీష్ తెల్లదొరల పాలనకు వ్యతిరేకంగా పోరాడి వందేమాతరం నినాదంతో బ్రిటీష్ వారు కాల్పుల్లో నేలకొరిగిన సీతారామరాజు స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు ఎస్.కె.లాల్‌విుయా పిలుపునిచ్చారు. మన్యం విప్లవ వీరుడు, బ్రిటీష్ దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేసిన మహా వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఆదివారం మండలంలోని కేశ్వాపురం గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉప్పెర సతానేలు, కుమారి, వెంకటి, అనిల్, సాకేత్, సంగీత, యేసు సులోమి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి పర్యటన


నూతన వధూవరులతో పొంగులేటి

తల్లాడ: మండలంలోని మల్లవరం, రామచంద్రాపురం గ్రామాల్లో ఆదివారం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా పలు వివాహాలకు హాజరై నూతన వధూవరులకు పట్టు వస్త్రాలను అందజేసి ఆశీర్వదించారు. నాయకులు గోపిశెట్టి వెంకటేశ్వరరావు, తూము వెంకటనారాయణ, ఎర్రి నరసింహారావు, తుమ్మలపల్లి రమేష్, నారపోగు వెంకటేశ్వర్‌రావ పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలను బహిష్కరించాలి


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సత్తుపల్లిరూరల్: దళితబంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సత్తుపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం 6వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బమ్మెర శ్రీనివాసరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవినీతికి పాల్పడిన వారిని వెంటనే పదవి నుంచి తొలగించి పార్టీ నుంచి బహిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొలికపోగు వెంకటేశ్వరరావు, గొల్లమందల ముత్తారావు, గోళ్లమూడి శ్రీనివాసరావు, పరిగడుపు లక్ష్మణ్, గంధం రాఘవ్, కనకపుడి రవి, తగరం మరియమ్మ, సుగుణమ్మ, సింగపోగు రాంబాబు పాల్గొన్నారు.

దుస్తుల వితరణ


దుస్తులు సేకరిస్తున్న కొండయ్య

మధిర: మధిర పట్టణంలోని ఆజాద్ రోడ్‌లో ప్రముఖ సామాజిక సేవకులు లంకా కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాత్మా గాంధీ ఓల్డ్ క్లాత్ బాంక్ కు ఆదివారం పలువురు దాతలు పాత దుస్తులను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా లంకా కొండయ్య మాట్లాడుతూ ఈ విధంగా సేకరించిన వాటిని పేద కుటుంబాలకు అందించనున్నట్లు తెలిపారు. లంకా ఫౌండేషన్ సభ్యులు పండు, సాయి, గోపి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు


కారేపల్లి: గ్రామ కార్యదర్శులకు సంఘీభావం తెలుపుతున్న బీజేపీ నాయకులు


వైరారూరల్: వంటా వార్పు చేస్తూ నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు

కారేపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో వెట్టి చాకిరీ చేయించుకొని వారిని రెగ్యూలరైజ్ చేయడంలో అలసత్వం వహిస్తున్నారని బీజేపీ వైరా నియోజకవర్గ నాయకుడు కాట్రావత్ మోహన్‌నాయక్ అన్నారు. ఆదివారం కారేపల్లి ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరవధిక సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శులకు బీజేపీ బృందం సంఘీభావం తెలిపింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కల్కి రాంప్రసాద్, నాయకులు తురక నారాయణ, అనిల్, భాస్కర్ పాల్గొన్నారు.

వంటావార్పు చేసి నిరసన..

వైరారూరల్: వైరాలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఆదివారం దీక్షల వద్ద వంటా వార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు. తమను రెగ్యూలరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించే వరకు పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు.

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ నిరవధిక సమ్మెలో భాగంగా ప్రభుత్వ తీరును నిరసిస్తూ వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. కార్యదర్శుల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తలపుల రాము, వరికూటి సురేష్‌లు మాట్లాడుతూ... ప్రభుత్వం తమ న్యాయమైన సమస్యల పరిష్కారంలో మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్యదర్శులు చల్లా రాజ్యలక్ష్మి, యరమల నాగిని, నర్సింహ, హారతి, శ్రీనివాసరావు, రామకృష్ణారెడ్డి, మహేష్, కిషోర్, శ్రీనివాస్, వంశీరాణి, శ్రావణి, పిచ్చియ్య, వెంకటలక్ష్మి, తిరుపతిరావు పాల్గొన్నారు.

ముదిగొండ: స్థానిక తహసీల్ ఎదుట తమ న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని పదిరోజులుగా నిరసన, దీక్షలు చేపడుతున్నారు. అక్కడే వంటలు తయారు చేసుకుని భోజనాలు చేశారు. మల్లారపు వెంకటేశ్వర్లు, పాషా, నాయిని వెంకటేష్, సతీష్, నరేష్, సురేష్ పాల్గొన్నారు.


ఎర్రుపాలెంలో..


ముదిగొండలో..

కాంగ్రెస్ నాయకులపై ఫిర్యాదు

కల్లూరు: ఉద్దేశపూర్వకంగా ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యపై తప్పుడు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు కోటూరి మానవతారాయ్, తదితరులపై కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం కల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాక వారు మాట్లాడారు. నిరంతరం ప్రజాసేవలో ఉంటున్న ఎమ్మెల్యే వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగేలా ప్రచారం చేస్తున్న మానవతారాయ్, కాంగ్రెస్ నేతలపై చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు, బోబోలు లక్ష్మణరావు, పెడకంటి రామకృష్ణ, కొరకొప్పు ప్రసాద్, కృష్ణ, రాచమళ్ల నాగేశ్వరరావు, దార్ల నరసింహారావు, చారుగుండ్ల సుధీర్, అర్లప్ప, జమలయ్య, పిచ్చిరెడ్డి, శంకర్ రావు, వెంకటేశ్వర్లు, కృష్ణ, రామిరెడ్డి, నాగిరెడ్డి, మంచాల కృష్ణ పాల్గొన్నారు.

సీఈఐఆర్‌తో సెల్ ఫోన్ గుర్తింపు

పెనుబల్లి: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి ఆదివారం పోలీసులు అందజేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సెల్ ఫోన్ పోగొట్టుకుని వీయంబంజర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై జి.సూరజ్ సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ఫోన్‌ను ట్రేస్ చేసి బాధితుడికి అప్పగించారు. దొంగ సెల్‌ఫోన్లు కొనుకోవద్దని ఎస్సై ప్రజలకు సూచించారు.

గులాబీజెండా ఎగరడం ఖాయం


బోనకల్: బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

బోనకల్: మధిర నియోజక వర్గంలో గులాబి జెండా ఎగరడం ఖాయమని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ అన్నారు. మండలంలోని తూటికుంట్ల గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు సమక్షంలో ఆదివారం బీఆర్ఎస్ చేరారు. పల్లెపల్లెకు బీఆర్ఎస్, గడపగడపకు సంక్షేమం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మధిర నియోజక వర్గంలో కోట్లాది రూపాయిలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు చేబ్రోలు మల్లిఖార్జున్, మోదుగుల నాగేశ్వరరావు, బందం శ్రీను, వేమూరి ప్రసాద్, బానోతు కొండ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో సన్మానం

చింతకాని: మండల పరిధిలోని వందనం గ్రామంలో మత్స్యశాఖ ఏర్పాటుకు కృషి చేసిన జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజును మత్స్యసొసైటీ సభ్యులు క్యాంప్ కార్యాలయంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్డిబోయిన సతీష్, చిలకా వెంకటేశ్వర్లు, నాగన్న, శ్రీను, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత వాగ్దానాలు నమ్మొద్దు


ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రుపాలెం: సీఎం కేసీఆర్ ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీ నాయకుల మోసపూరిత వాగ్దానాలు ప్రజలు ఏమాత్రం నమ్మొద్దని పీసీసీ మెంబర్ శీలం ప్రతాప రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు బండారు నర్సింహారావులు కోరారు. ఆదివారం రాత్రి మండలంలోని రామాపురం, పెద్దగోపవరం గ్రామాల్లో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కరపత్రాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తొందని, కాంగ్రెస్ వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంచర్ల వెంకటనర్సయ్య, పిల్లి బోస్, కోటపాటి పాండు రంగారావు, కోటపాటి పూర్ణ, చెరుకుమల్లి జగన్నాథం, రావూరి నాగబాబు, గద్దల విజయ్‌కుమార్, ఐనపూరి ఏసురత్నం, పెండ్లి నారాయణ, నంద్రు జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

సెయిలింగ్ పోటీల్లో విజేతకు సన్మానం


వైరారూరల్: సన్మాన సభలో మాట్లాడుతున్న సర్పంచ్ జయరాజు

వైరారూరల్: మేఘాలయ రాష్ట్రం నార్త్ ఈస్ట్ షిల్లాంగ్‌లో ఇటీవల జరిగిన సెయిలింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన మండలంలోని కొస్టాలకు చెందిన పిల్లి అఖిల్‌ను స్థానికులు ఆదివారం సన్మానించారు. పోటీల్లో విజయం సాధించిన తర్వాత గ్రామానికి చేరుకోగా అఖిల్‌తో ఆయన తల్లిదండ్రులు శరత్‌బాబు – ప్రమీలకు ఘన స్వాగతం పలికి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయనను సన్మానించి అభినందించారు. తాటిపూడి, కొస్టాల సర్పంచ్‌లు భట్టా పెద్ద భద్రయ్య, మంచాల జయరావు, ఉప సర్పంచ్‌లు ఈవూరి ఆదిలక్ష్మి, సత్యనందం పాల్గొన్నారు.

క్రికెట్ క్రీడాకారుడికి..


పెనుబల్లి: యశ్వంత్‌కుమార్‌కు సన్మానం..

పెనుబల్లి: తెలంగాణ క్రికెట్ జట్టుకు ఎంపికైన మండలంలోని పాతకుప్పెనకుంట్లకు చెందిన వడ్డెబోయిన యశ్వంత్ కుమార్‌ను ఆదివారం సన్మానించారు. అభయ లయన్స్‌క్లబ్ చైల్డ్ ఎడ్యుకేషన్ చైర్మన్ చలమాల నరసింహారావు ఆధ్వర్యాన ఆయనను సన్మానించి మాట్లాడారు. క్లబ్ సభ్యులు అన్నపురెడ్డి సుంకయ్య, వడ్డెబోయిన నాగేశ్వరరావు, సర్పంచ్ మామిడి మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లిలో ఉరుములతో వర్షం



కారేపల్లి: మండలంలో ఆదివారం మధ్యాహ్నం ఉరుములతో కూడిన వర్షం కురిసింది. అక్కడక్కడ గాలి దుమారానికి చెట్లు విరిగిపడ్డాయి. దుబ్బాతండా గ్రామంలో రామాలయం పక్కన ఉన్న చెట్టుపై పిడుగు పడడంతో చెట్టు కుప్పకూలిపోయింది. దీంతో గ్రామస్తులు భయాందోళన చెందారు.

శ్లాబ్ పెచ్చులు పడి మహిళకు గాయాలు

సత్తుపల్లిటౌన్: పట్టణ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో ఇంటి శ్లాబ్ పెచ్చులుపడి మహిళకు తీవ్ర గాయాలైన ఘటన శనివారం రాత్రిచోటు చేసుకుంది. కాలనీకి చెందిన వహీద నిద్రిస్తుండగా సింగరేణి బాంబ్ బ్లాస్టింగ్‌లతో శిథిలావస్థలో ఉన్న కాలనీ శ్లాబ్ పెచ్చులు ఊడి మీదపడ్డాయి. దీంతో వహీదకు గాయాలు కావడంతో ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతుంది. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కాలనీవాసులు కోరారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు


దేవాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

ఏన్కూరు: మండల పరిధిలోనిగార్లఒడ్డు శ్రీ లక్ష్మీనర్సింహస్వామి సన్నిధిలో ఈ నెల 3 నుంచి 7వరకు జరుగుతున్న బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. చివరిరోజులో భాగంగా యాగశాల ద్వారతోరణపూజ, వేదపారాయణం, మహాపూర్ణహుతి, చక్రతీర్థం, శ్రీవిష్ణుసహస్రనామ పారాయణం, దేవతోద్వాసన, ద్వాదశారాధన, పుష్పయాగము తదితర ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ శేషయ్య, దొరబాబు, వేద పండితులు బీటూకూరి వెంకటాచార్యులు, నాగరాజు ఆచార్యులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

రోడ్లన్నీ ధ్వంసం... రాకపోకలకు అడ్డం



మండలంలోని ఆర్అండ్‌బీ రోడ్లన్నీ గ్యాస్ పైపులైన్ల పేరుతో ఇష్టమొచ్చినట్టుగా ధ్వంసం చేస్తున్నారు. న్యూలక్ష్మీపురంలో గ్యాస్‌లైన్ పైపులకు ఆర్అండ్‌బీ రోడ్డును ఇష్టమొచ్చినట్లు భారీ యంత్రాలతో తవ్వకాలు జరుపుతున్నారు. నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిన ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డు ధ్వంసం చేస్తున్నారు. ఈ క్రమంలో రాకపోకలు సాగించే వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. తవ్విన మట్టిని రోడ్డుపై పోయడంతో సింగిల్ ఇరుకురోడ్డులో వాహనదారులకు ఇబ్బందులకు గురవుతున్నారు. చొరవచూపి మండలంలోని రోడ్ల వెంట తవ్వకాల వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజాప్రతినిధులు, ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – ముదిగొండ

ప్రశ్నించాల్సిన అధికారి : రాజేష్, ఆర్అండ్‌బీ ఏఈ, మధిర
సెల్ నంబర్ : 9441055478